సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 10 । నవంబర్ । 2024



విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం ఘనంగా జరిగాయి.



వేడుకగా బంతిపూల గౌరమ్మ

విశాఖ: అల్లిపురంలో గౌరీ పరమేశ్వర ఉత్సవాల్లో భాగంగా బంతిపూల గౌరమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



దట్టంగా పొగమంచు

డుంబ్రిగుడ: మంచు దట్టంగా కురుస్తోంది. చలి ప్రభావం ఎక్కువగా ఉంది. శనివారం ఉదయం 9 వరకు మంచు తెరలు కమ్మేశాయి

న్యూస్‌రీల్

ప్రతి పీహెచ్‌సీలో నెలకు వందమంది గర్భిణులకు చెకప్

డీఎంహెచ్‌వో బాలాజీ



పెనుగొల్లు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

ఎస్.రాయవరం: తనిఖీల కోసం గ్రామీణ ప్రాంత గర్భిణులు ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రికి వచ్చేలా సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ అన్నారు. పెనుగొల్లు పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో నెలకు వందమంది గర్భిణులకు తగ్గకుండా చెకప్‌లు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 16 సచివాలయాలు, 43 వేల మంది జనాభా ఉన్నప్పటికీ శనివారం కేవలం 17 మంది గర్భిణులు రావడం పట్ల జిల్లా వైద్యాధికారి అసంతృప్తి వ్యక్తపరిచారు. పీహెచ్‌సీ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని, పీహెచ్‌సీల్లో అందిస్తున్న సేవల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. వైద్యాధికారి నిత్యం పర్యవేక్షించాలన్నారు. మరోసారి తన దృష్టికి ఇదే పరిస్థితి కనిపిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులు పరిశీలించారు. ఓపీలో రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి రాజేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా హాస్టల్స్‌లో రూ.4.5 కోట్ల బిల్లుల పెండింగ్



బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీ రాజేశ్వరి, తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: జిల్లాలో హాస్టల్స్‌కు జూలై నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు కె.రాజేశ్వరి చెప్పారు. మండల కేంద్రంలో గల ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల వసతి గృహంలో రెండు రోజులుగా పలువురు విద్యార్థినులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టరు హాస్టల్ ప్రాంగణంలో పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో ఏకాంతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు, విద్యుత్ లైటింగ్ అధ్వానంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. హాస్టల్ ఇన్‌చార్జి మేట్రిన్ నూకరత్నం పనితీరులో మార్పు రావాలన్నారు. తర్వాత బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను తనిఖీలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీసీ హాస్టల్స్ బిల్లులు జూలై నుంచి నేటి వరకు రూ.3 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్సీ హాస్టల్స్ బిల్లులు జూలై నుంచి సుమారు కోటి 50 లక్షలకు పైగా వసూలు కావలసి ఉందన్నారు. నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలోకి తాత్కాలికంగా బాలికల హాస్టల్‌ను మార్పు చేసేందుకు తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. తాను గమనించిన అంశాలను నివేదిక ద్వారా కలెక్టరుకు నివేదిస్తానన్నారు.

'సీవిజిల్'కు సన్నాహక శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో నేవీ, మెరైన్ పోలీస్, లైట్ హౌస్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: 'సీ విజిల్'సమర సన్నద్ధ విన్యాసాలకు సంబంధించిన శిక్షణ తరగతులను ఇండియన్ నేవీ నిర్వహిస్తోంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో కోస్టల్ సెక్యూరిటీకి బాధ్యత వహించే నౌకాదళాధికారులు, ఏపీ నోడల్ అధికారులు, మెరైన్ పోలీసులు, డీజీఎల్ఎల్ లైట్ హౌస్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. తీరప్రాంత భద్రత, కమ్యూనికేషన్, నిఘా, పెట్రోలింగ్, ముప్పు గుర్తింపు, రిపోర్టింగ్ ప్రోటోకాల్‌లపై శిక్షణ అందించారు. నవంబర్ 20, 21న నిర్వహించే సీవిజిల్ ప్రధాన వ్యాయామానికి సంసిద్ధతను అధికారులు తెలియజేశారు. తీర భద్రతపై ప్రధాన ఏజెన్సీగా భారత నౌకాదళాన్ని నియమించినట్లు అధికారులు వెల్లడించారు.





కూటమి ప్రభుత్వం ఏం చేసినా ఆ పార్టీ నాయకులకు కాసుల పంటే.. ప్రభుత్వం ప్రవేశపెట్టే పాలసీలతో ఈ తరమే కాకుండా మరో తరం కూడా హ్యాపీగా బతికేసేందుకు వీలుగా కాసులు బాగా వెనకేసుకోవచ్చు.. వారి రాజకీయ భవితవ్యానికి ఉచితంగా దొరికే వనరులతో బంగారు బాట వేసుకోవచ్చు.. ఉచిత ఇసుక పాలసీ.. ఇదే ఇప్పుడు ఆ పార్టీ నాయకులకు బంగారు గనిలా మారింది.

వంద రోజుల్లో రూ.కోటి..

- ఇది ఓ టీడీపీ నేత టార్గెట్
- ఉచిత ఇసుక పేరిట మహా దోపిడీ
- యథేచ్ఛగా సాగుతున్నా పట్టని అధికారులు

ఇసుక తరలింపునకు అనువుగా వేసిన బాట, (ఇన్‌సెట్) వరాహనదిలో తరిగిపోతున్న ఇసుక నిల్వలు

కోటవురట్ల: గత **ఐదేళ్లుగా అక్రమ సంపాదనకు మొహం వాచిపోయి ఉన్న టీడీపీ నాయకులు** ఉచిత ఇసుక పేరుతో దోపిడీకి తెర తీశారు. వరాహనది ఇప్పుడు వారికి కాసుల పంట పండిస్తోంది. హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలోనే ఈ మహా దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. గొట్టివాడకు చెందిన ఓ టీడీపీ నాయకుడు తన రాజకీయ భవిష్యత్‌ను పదిలం చేసుకునేందుకు రెండు చేతులా సంపాదిస్తున్నారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి దిగి రూ.లక్షలు కుమ్మరించేందుకు రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇది ఎంతలా ఉందంటే ఒక నెల రోజుల్లోనే గొట్టివాడ వరాహనది ఇసుక రీచ్‌లో మట్టి దిబ్బలు కనిపించేలా సాగుతోంది. వంద రోజుల్లో రూ.కోటి టార్గెట్‌గా దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. రోజుకు 50 ట్రాక్టర్ల ద్వారా అక్రమ **రవాణా లక్ష్యంగా దోపిడీ జరుగుతోంది. నాటు బళ్ల ద్వారా నదిలోని ఇసుకను తోడేసి.. మామిడి** తోటలు, రహదారుల పక్కన, కొండల నడుమ, తమ స్థావరాలలోను నేరుగా నిల్వ చేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా అమ్మకాలకు పాల్పడుతున్నారు. ఒక్క రోజుకు 50 ట్రాక్టర్ల ఇసుక అంటే దాదాపు రూ.లక్ష వెనకేసుకోవచ్చు. దీనిని బట్టి ఏ స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

జాడ లేని మైనింగ్ అధికారులు

ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరుగుతుంటే మైనింగ్ అధికారుల జాడ లేకపోవడం శోచనీయం. ఎవరి మామూళ్లు వారికి వెళుతుండడంతో ఇసుక దోపిడీ మహా గొప్పగా సాగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మధ్యమధ్యలో తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులిపేసుకోవడం, **మళ్లీ దోపిడీ పర్వం ప్రారంభం కావడం నిత్యకృత్యంగా మారింది. సదరు టీడీపీ నేత చేస్తున్న** మహా దోపిడీని ఎలాగూ అడ్డుకోలేమన్న భావనలో మిగతా పార్టీల కార్యకర్తలు చిన్న మొత్తాలకు కక్కుర్తిపడి నోరు మెదపడంలేదన్న వాదన వినిపిస్తోంది. సదరు టీడీపీ నేత గ్రామాభివృద్ధి అంటూ వేలం పాటలో ఆ గ్రామానికి రూ.5 లక్షలు పడేసి.. వారం రోజుల్లోనే ఆ సొమ్ము రాబట్టుకున్నారు. తాజాగా ఇసుక దోపిడీపై ఫిర్యాదు రావడంతో శుక్రవారం రాత్రి రెవెన్యూ అధికారులు గొట్టివాడ పరిధిలో దాడులు చేయగా లారీలలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 70 ట్రాక్టర్ల ఇసుక దొరికిన సంగతి తెలిసిందే. దీనిని బట్టే ఇసుక దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం నుంచి వస్తున్న భరోసాతోనే ఈ స్థాయిలో దోపిడీ జరుగుతుందన్న ప్రచారం జరుగుతోంది.



షేక్ నాగూర్
మేథమేటిక్స్ స్కూల్ అసిస్టెంట్, గుంటపల్లి జెడ్పీ హైస్కూల్



బి.సహదేవుడు
గణిత అధ్యాపకుడు, రోలుగుంట జూనియర్ కాలేజీ

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

- రేపు అవార్డుల ప్రదానం

పాయకరావుపేట/రోలుగుంట: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. గుంటపల్లి జెడ్పీ హైస్కూల్లో మేథమేటిక్స్ స్కూల్ అసిస్టెంట్ షేక్ నాగూర్, రోలుగుంట జూనియర్ కాలేజీలో గణిత అధ్యాపకుడు బి.సహదేవుడులకు అవార్డులు అందజేయనున్నట్టు విద్యాశాఖ శనివారం ప్రకటించింది. ఈ నెల 11వ తేదీన జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి అమరావతిలో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. షేక్ నాగూర్ గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. అదే ఏడాది గ్రీన్ ఇండియా సొసైటీ వారు ఉస్మానియా యూనివర్సిటీలో అవార్డు ప్రదానం చేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ రూపకల్పనలోనూ జూలైలో రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందారు. కరోనా సమయంలో యూట్యూబ్‌లో ఆయన బోధించిన లెక్కల పాఠాలు ఎంతో ఆదరణ పొందాయి. గణిత అవధానం చేస్తూ.. విద్యార్థులకు ఆ ప్రక్రియలో తర్ఫీదు ఇస్తున్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా 2019లో నాటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకుంటున్న షేక్ నాగూర్

మ్యాథ్స్ మేడ్ ఈజీ..

అవార్డుకు ఎంపికయిన రోలుగుంట మ్యాథ్స్ లెక్చరర్ సహదేవుడు మాట్లాడుతూ అందరూ భయపడే గణితాన్ని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సహదేవుడికి అవార్డు రావడం పట్ల ప్రిన్సిపల్ ఎం.అప్పలరాజు, జువాలజీ లెక్చరర్ లాలం తులసి, లైబ్రేరియన్ మల్లికార్జునరావు, ఇంగ్లిష్ లెక్చరర్ ఎం.వి.ఎస్.ప్రభాకర్‌రావు, సహచర అధ్యాపకులు, కళాశాల సిబ్బంది హర్షం ప్రకటించారు.

హత్యాయత్నం చేసింది అయ్యన్న అనుచరుడే..

- ఇద్దరూ దిగిన ఫొటోను ప్రదర్శించిన మాజీ ఎమ్మెల్యే గణేష్



స్పీకర్ అయ్యన్నపాత్రుడితో రౌడీషీటర్ దిగిన ఫొటోను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: తమ పార్టీ నాయకుడు కర్రి శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేసిన రౌడీ షీటర్‌పై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అతనికే వత్తాసు పలకడం సరికాదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్, వారి కుటుంబ సభ్యులతో రౌడీషీటర్ దిగిన ఫొటోలను మీడియా ముందుంచారు. పోలీసులంటే తమకు ఎంతో గౌరవం ఉందని, దానిని పాడు చేసుకోవద్దని పోలీసులకు హితవు పలికారు. తమ పార్టీ నాయకుడిపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్ పప్పలనాయుడిపై కఠిన చర్యలు తీసుకోకుండా స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఆదేశాలతో పెట్టీ కేసుతో పోలీసులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రౌడీషీటర్ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి ముఖ్య అనుచరుడని, స్పీకర్ అండదండలతో రౌటీషీటర్ పట్టపగలు నడిరోడ్డుపై హత్యాయత్నానికి తెగబడ్డాడన్నారు. రౌడీషీటర్‌పై ఇప్పటికే 40 కేసులు ఉన్నాయన్నారు. ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్నవారిని తమ పార్టీ నాయకులు పట్టుకుంటే దొంగలను విడిచిపెట్టి తమ వారిపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఒత్తిడి మేరకు తప్పుడు కేసులు పెడితే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వం వస్తుందని, అక్రమ కేసులను బయటకు తీసి చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు.

ఆరోగ్యశ్రీ రోగులకు 'ఆసరా' ఏది?

అనకాపల్లి: ఆరోగ్యశ్రీ రోగులకు బకాయిపడ్డ ఆసరా నగదును ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు మాసం నుంచి నేటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లకు ఇవ్వవలసిన నగదును చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లు చేయించుకుని ఇంటి వద్ద కోలుకోవలసిన రోగులకు గత ప్రభుత్వం ఆసరా నగదు చెల్లించేదని, దీనివల్ల ఇంట్లో సంపాదించే మనిషి మంచాన పడితే ఆ సొమ్ము కుటుంబానికి ఎంతో ఉపయోగపడేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు మాసం నుంచి కూటమి ప్రభుత్వం ఈ సొమ్ము చెల్లించకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల రోగులతో ఆడుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన హితవు పలికారు.

భర్తకు తలకొరివి

- కుమారులు విదేశాల్లో..
- రుణం తీర్చుకున్న భార్య



భర్తకు తలకొరివి పెడుతున్న భార్య జగ్గయమ్మ

మునగపాక: ఇద్దరు కుమారులున్నా సకాలంలో రాలేకపోవడంతో కట్టుకున్న భార్యే భర్తకు తలకొరివి పెట్టిన సంఘటన మునగపాకలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేగి చంద్రశివ (64) వ్యవసాయ కూలీగా పనిచేసి జీవనం సాగించేవారు. అతనికి భార్య జగ్గయమ్మతో పాటు ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్ద కుమారుడు గంగ, చిన్న కుమారుడు శంకర్ ఏడాది నుంచి జీవనోపాధి కోసం సౌత్ ఆఫ్రికాలో ఉంటున్నారు. చంద్రశివ శుక్రవారం మునగపాకలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరై అందరితో సరదాగా గడిపాడు. రాత్రి ఇంటికి వచ్చి మంచంపై నిద్రపోయాడు. నిద్రలోనే ప్రాణం పోయింది. ఉదయం నిద్ర లేపినప్పుడు మృతి చెందిన విషయం గమనించి.. అతని భార్య జగ్గయమ్మ ఒక్కసారిగా సొమ్మసిల్లిపడిపోయింది. చంద్రశివ ఇద్దరు కుమారులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో భార్యే అంత్యక్రియలకు సిద్ధమై తలకొరివి పెట్టి భర్త రుణం తీర్చుకుంది.

ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం

తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరాధార ప్రకటన చేస్తే.. భక్తుల మనోభావాలు దెబ్బతినలేదంట.. తిరుమల అన్న ప్రసాదంలో జెర్రి వచ్చిందన్న నిజాన్ని పోస్టు పెడితే మనోభావాలు దెబ్బతిన్నాయని కేసులు.

చంద్రయాన్–3 కోసం ఇస్రో రూ.615 కోట్లు ఖర్చు చేస్తే.. విజయవాడ వరద బాధితులకు అందించిన పులిహోరకు రూ.326 కోట్లా అని ప్రశ్నిస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబును కించపరిచారంటూ కేసు..

ఇలా ప్రభుత్వ తప్పిదాలు.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రశ్నిస్తున్న నోర్లను నొక్కేయాలని కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతోందనడానికి సజీవ సాక్ష్యాలే ఈ కేసులు.

- నలుగురు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ అరెస్ట్
- కూటమి నేతల అక్రమ ఫిర్యాదులతో నాన్ బెయిలబుల్ కేసులు
- విచారణ పేరుతో చిత్ర హింసలు



సాక్షి, విశాఖపట్నం/మధురవాడ/అగనంపూడి: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని సాక్షాత్తు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగ సమావేశంలోనే వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలో తీవ్ర దుమారాన్ని రేపింది. ఆ వ్యాఖ్యలతో ప్రభుత్వ గొంతులో వెలక్కాయ పడినట్లయింది. దీంతో నష్ట నివారణ చర్యలకు దిగిన చంద్రబాబు ప్రభుత్వం ఎప్పటిలాగే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసింది. ప్రజల దృష్టిని మరల్చడానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీస్ అస్త్రాన్ని ప్రయోగించింది. 2019 నుంచి ఇప్పటివరకు సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల ఆధారంగా ప్రశ్నించే గొంతులను ఖాకీల ద్వారా నొక్కించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని హరిస్తూ.. భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాస్తూ.. కక్ష సాధిస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తూ.. సోషల్ మీడియా కార్యకర్తలను జైలుకు పంపిస్తోంది. ఇప్పటికే విశాఖ జిల్లాకు చెందిన నలుగురు కార్యకర్తలకు చిత్ర హింసలకు గురిచేసి కటకటాల పాలు చేసింది. మరింత మందిని కూడా జైలు పాలు చేయడానికి కూటమి పార్టీల చోటా నేతల ద్వారా కేసులు పెట్టిస్తోంది.

విచారణ పేరుతో వేధింపులు



ఇంటూరి రవికిరణ్

అగనంపూడి: విచారణ పేరుతో పొలిటికల్ పంచ్ వెబ్‌చానల్ నిర్వాహకుడు ఇంటూరి రవికిరణ్‌ను దువ్వాడ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మధురవాడలోని ఆయన నివాసం నుంచి స్టేషన్‌కు తరలించారు. మధుమేహంతో బాధపడుతున్న ఆయనకు మధ్యాహ్నం మూడున్నర వరకు కనీసం భోజనం చేయనీయకుండా విచారణ పేరుతో మానసిక వ్యథకు గురిచేశారని రవికిరణ్ భార్య సుజన, కుమారుడు హృదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం చేసి టాబ్లెట్ వేసుకోవాలని చెప్పినా సీఐ అనుమతించేది లేదని వాపోయారు. రాత్రి 9 దాటిన తరువాత రవికిరణ్‌కు 41ఎ నోటీసులు అందించి ఈనెల 11వ తేదీన మెజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని చెప్పి విడిచిపెట్టారు. ఇదిలా ఉండగా రవికిరణ్‌పై మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదవ్వడంతో ఆయన్ని అక్కడికి తరలించారు. అక్కడ కూడా 41ఏ నోటీసులు ఇచ్చి పంపించేశారు. రవికిరణ్‌ను కేసులు, విచారణ అంటూ రెండు నెలలుగా పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన భార్య సుజన వాపోయారు. గుంటూరు, విజయవాడ, మార్టూరు, గుడివాడ పోలీస్టేషన్లలో కేసులు నమోదు చేసి వేధిస్తున్నారన్నారు.

వెంకటేష్‌కు రిమాండ్



వెంకటేష్

గాజువాక మండలం గొల్లజగ్గరాజుపేటకి చెందిన బోడి వెంకటేష్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న కారణంగా వెంకటేష్‌పై ఈ నెల 3వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 5వ తేదీన బాపట్ల పోలీసులు నోటీసు ఇవ్వకుండా వెంకటేష్‌ను దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. 41ఏ నోటీసు ఇచ్చి విడుదల చేశారు. ఈ నెల 6వ తేదీన గాజువాకకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సాకెళ్ల రతన్‌కాంత్.. వెంకటేష్‌పై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 7వ తేదీన విచారణకు పిలిచి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

4 రోజులుగా పొదిలి స్టేషన్‌లో..




రమణారెడ్డి

మద్దిలపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త బోస రమణారెడ్డిపై మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ఫొటో మార్ఫింగ్ అభియోగాలపై ప్రకాశం జిల్లా పొదిలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6వ తేదీ రాత్రి 10 గంటలకు పొదిలి పోలీసులు రమణారెడ్డికి ఇంటికి వెళ్లి తీసుకుపోయారు. ముందు ఒంగోలు పోలీస్‌స్టేషన్‌కు, తరువాత ఎస్పీ కార్యాలయానికి, అక్కడ నుంచి పొదిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం పొదిలి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు. నాలుగు రోజుల నుంచి అక్కడే ప్రత్యేక రూంలో నిర్బంధించారు. విచారణ సమాచారం బయట చెబితే నాన్ బెయిల్‌బుల్ కేసులే నమోదు చేస్తామని సీఐ బెదిరించినట్లు అతని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ సోషల్ మీడియాపై చర్యలుండవా?

- మాజీ సీఎం వైఎస్ జగన్, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోరేం
- నిబంధనలకు విరుద్ధంగా అరెస్టులు చేయడం అన్యాయం
- ఏఎస్పీకి మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వినతిపత్రం

తుమ్మపాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితర నాయకులతో కలిసి అనకాపల్లిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏఎస్పీ దేవప్రసాద్‌కు వినతిపత్రం అందించి టీడీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను ఆధారాలతో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల పేరుతో పోలీసులు తీసుకుంటున్న చర్యలను టీడీపీ సోషల్ మీడియాకు కూడా వర్తింపజేయాలని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. చట్టానికి లోబడి చర్యలు తీసుకోవాలి గానీ.. నిబంధనలకు విరుద్ధంగా అరెస్టులు చేయడం, నిర్ణీత గడువులోగా కోర్టు ముందుంచకపోవడం తదితర కక్షసాధింపు చర్యలు మంచి పరిణామం కాదన్నారు. టీడీపీతో సంబంధమున్న సోషల్ మీడియా కార్యకర్తలు ఆరోగ్యకరమైన రాజకీయ విమర్శల హద్దులు దాటి.. నిరాధారమైన ఆరోపణలను ప్రచారం చేయడం, ప్రజల్లో అశాంతిని రెచ్చగొట్టడం వంటివి చేస్తున్నారన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు మలసాల కిషోర్, మలసాల కుమార్‌రాజా, పి.గోవింద, కె.ఎం.నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

క్లుప్తంగా

మొక్కలు నాటిన సీనియర్ సివిల్ జడ్జి



మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్

సర్పీపట్నం : జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకుని శనివారం కోర్టు సముదాయంలో మండల లీగల్ సర్వీస్సు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్ మొక్కలు నాటారు. అటవీశాఖ వారు సమకూర్చిన మొక్కలను కోర్టు అవరణలో జడ్జి సీనియర్ న్యాయవాదులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా అటవీ అధికారి శామ్యూల్ మొక్కలు నాటారు. కోర్టు అవరణను పూల కుండీలతో బ్యూటిఫికేషన్ చేశారు. మొక్కలను సంరక్షించే బాధ్యతను కోర్టు సిబ్బందికి అప్పగించారు. ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే చేసి పనికి ప్రతిఫలం లభిస్తుందని జడ్జి సూచించారు. అనంతరం కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో సమావేశమయ్యారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.ప్రభాకర్, పి.నాగేశ్వరరావు, పి. నర్సింహరావు, కె.అప్పలనాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న జనసేన నాయకుడి అరెస్ట్

79 మద్యం సీసాలు, నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో జనసేన నాయకుడు అప్పారావు(తెలుపు చొక్కా)

అక్కిరెడ్డిపాలెం: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న జనసేన నాయకుడిని గాజువాక పోలీసులు శనివారం అరెస్ట్ చేసి, అతని నుంచి మద్యం బాటిళ్లు, నగదు, ఒక బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలివీ.. షీలానగర్‌లోని కుంచమాంబ ఆలయం వద్ద ఉన్న ఒక షాపులో జగ్గయ్యపాలేనికి చెందిన జనసేన నాయకుడు బుదిరెడ్డి అప్పారావు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ టి.రవికుమార్, సిబ్బందితో కలిసి బెల్ట్ షాపుపై దాడి చేశారు. 79 క్వార్టర్ బాటిళ్లు, రూ.5,060 నగదు, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అప్పారావు పందుల పెంపకం చేపడుతుంటారు. అందరూ ఆయన్ని పందుల అప్పారావుగా పిలుస్తుంటారని, అతనిపై అనేక రకాల ఆరోపణలు న్యాయని స్థానికులు చెప్పారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



బాలికల విభాగంలో తలపడుతున్న జట్లు



బాలుర విభాగంలో తలపడుతున్న జట్లు

- సెమీస్‌కు చేరిన 8 జట్లు

నక్కపల్లి : ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో అండర్14 బాల బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. ఈనెల 8న ప్రారంభమైన పోటీలు పదో తేదీ వరకు జరుతాయి. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి సుమారు 500 మంది హాకీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. మొదటిరోజు ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపిక కోసం ఈ పోటీలు ఏర్పాటు చేశారు.

సెమీస్‌కు తలపడిన జట్లు ఇవే..

బాలికల విభాగంలో ...
వైఎస్సార్ కడప, విజయనగరం మధ్య పోటీ జరగ్గా 8–0 తేడాతో కడప విజయం సాధించింది. కృష్ణా , చిత్తూరు మధ్య జరిగిన పోటీల్లో 0–1తేడాతో చిత్తూరు గెలుపొందగా, విశాఖపటన్నం–తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో 5–0 తేడాతో విశాఖపట్నం, అదేవిధంగా కర్నూలు, గుంటూరు మధ్య జరిగిన పోటీల్లో 1–0 తేడాతో కర్నూలు విజయం సాధించాయి. ఈ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి.

బాలుర విభాగంలో..
కడప , అనంతపురం మధ్య జరిగిన పోటీల్లో 6–0 తేడాతో కడప విజయం సాధించింది. తూర్పుగోదావరి, గుంటూరు మధ్య జరిగిన పోటీలో 2–0 తేడాతో తూర్పుగోదావరి గెలుపొందగా, ప్రకాశం, చిత్తూరు మధ్య జరిగిన పోటీల్లో 1–0 తేడాతో చిత్తూరు విజయం సాధించింది. విశాఖపట్నం, నెల్లూరు మధ్య జరిగిన పోటీల్లో 5–0 తేడాతో విశాఖపట్నం గెలుపొంది సెమీస్‌కు చేరింది. ముగింపు పోటీలు ఆదివారం జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు

తుమ్మపాల : రాష్ట్ర స్థాయి 68 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 31 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ గల్లా జయబాబు అన్నారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయనతో పాటు వ్యాయామ సంచాలకుడు కె.వి.ఎస్.నాయుడు మాట్లాడుతూ ఎంపికైన 19 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ నెల 16 నుంచి చిత్తూరు జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. ఖోఖో బాలుర జట్టులో కె.రామచరణ్, పి.జయవర్ధన్, ఎల్వీఎస్ఎస్ నాయుడు, ఆర్.దీపక్ సాయి, ఆర్ఓం ప్రకాష్, జి.హరిష్, ఎంపీఎం గణేష్, ఎస్ఎన్‌టీకే రాజ్, పి.జానకిరామ్, వి.అనిల్‌కుమార్, జి.హర్ష, పి.కిశోర్, ఎల్.రమణమూర్తి, బి.గౌతమ్, పి.ఆర్ దేవ్. జి.మోహన్‌కుమార్ ఎంపికైనట్టు ప్రకటించారు. బాలికల జట్టులో సీహెచ్ దివ్య, ఎం.హేమనందిని, వై.తులసి, పి.భాను, పి.ధనలక్ష్మి, పి. జయలక్ష్మి, కె.సాత్విక, పి.వెంకటలక్ష్మి, ఎస్.కె.మహేశ్వరి, జి.నాగమణి, ఎస్.కె.చిన్నారి. ఎస్. ఝాన్సీ, ఎస్.జయశ్రీ. వి.వెంకటలక్ష్మి, యు.మాధవి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నామన్నారు. వీరిని కళాశాల అధ్యక్ష, కరస్పాండెంట్లు కె.ఎస్.ఎన్ మంగరాజు, దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్ అభినందించారు.

సారాబట్టీలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం పులుపును పరిశీలిస్తున్న ఎస్ఐ శేఖరం, సిబ్బంది

కె.కోటపాడు : కొరువాడ గ్రామంలో గల కండిపల్లి చెరువు సమీపంలో ఉన్న సారా తయారీ కేంద్రాలపై చోడవరం ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. చెరువు ప్రాంతంలో నాటుసారా తయారీకి డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లం పులుపును గుర్తించిన ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం సిబ్బందితో కలిసి వాటిని ధ్వంసం చేశారు. నాటు సారాను సేవించడం వల్ల తీవ్రమైన అనారోగ్యం బారిన ప్రజలు పడే పరిస్థితులు ఉంటాయని అన్నారు. చట్టవ్యతిరేకమైన నాటుసారా తయారీకి పాల్పడే వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శేఖరం హెచ్చరించారు.

సాంబశివుని శూలాల మహోత్సవానికి ఏర్పాట్లు



ఆకట్టుకునే శివలింగం



మునగపాక సాంబశివుని ఆలయం

- 11న మునగపాకలో శూలాల సంబరం

మునగపాక : సాంబశివుని శూలాల మహోత్సవాన్ని ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. ఏటా కార్తీకమాసం రెండో సోమవారం శూలాల మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామన్నారు. తెల్లవారు 4 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకునే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఉత్సవాల్లో నేలవేషాలు, రాత్రికి పలు కూడళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎస్ఐ పి.ప్రసాదరావు సారథ్యంలో గట్టి బందోబస్తు కూడా నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలకు విజయవంతం చేయాలన్నారు.

అయోధ్యలో విశాఖ నృత్య కళాకారుల ప్రతిభ

సీతమ్మధార: అయోధ్య యూనివర్సిటీలో శనివారం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రామ్‌లీలా సంగీత నృత్యార్చన నిర్వహించారు. దొండపర్తి నుంచి సిరి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు స్వర్ణ సారథ్యంలో పది మంది నృత్య కళాకారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. 2024కు సంబంధించి రామ్‌లీలా పురస్కారాన్ని సిరి డ్యాన్స్ అకాడమీకి చెందిన పది మంది నృత్య కళాకారులకు అందజేశారు. దేశ వ్యాప్తంగా కూచిపూడి కళాకారులు పోటీపడ్డారు. విజేతలకు అయోధ్య మేయర్‌తోపాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కాశీవిశ్వనాథ్ టెంపుల్ శ్రీవిశ్వభూషణ్ మిశ్రా, అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ అశ్వినికుమార్ పాండే చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

వ్యాన్ కేబిన్‌లో నుంచి జారిపడి డ్రైవర్ మృతి



మృతుడు జోగి గోవింద్

రేగిడి: విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు కర్మాగారం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌లో నిద్రిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత కిందపడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పి.నీలావతి తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం కోడూరు అగ్రహారానికి చెందిన జోగి గోవింద (55) ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఐచర్ వ్యాన్‌తో తవుడు లోడుతో వచ్చాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి క్యాబిన్‌లోనే నిద్రించాడు. నిద్ర మత్తులో క్యాబిన్ నుంచి కింద పడిపోవడంతో కాలు స్టీరింగ్‌లో ఇరుక్కుని వేలాడుతూ ఉండిపోయాడు. ఇది గమనించేందుకు ఎవరూ లేరు. శనివారం కుటుంబ సభ్యులు గోవింద్‌కు ఫోన్ చేసినప్పటికీ విషయం తెలియరాలేదు. విషయాన్ని స్థానిక కర్మాగార సిబ్బందికి తెలియజేశారు. వారు వెళ్లి చూడగా ఐచర్ వ్యాన్‌లో గోవింద ఇరుక్కుని పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకోవాలి

- సీపీఎం నాయకుల పిలుపు



మండల మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, చిత్రంలో వెంకన్న

దేవరాపల్లి : దేవరాపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో సీపీఎం మండల మహా సభ షేక్ అప్పాసాహెబ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులిస్తే రైతులు, గిరిజనులు ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైవాడ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. దేవరాపల్లి కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను అభివృద్ధి చేసి కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని, హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని అన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, జీడికి మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కనుగోలు చేయాలని కోరారు. శారదా నదిపై వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, నిత్యావసర ధరలను నిరసిస్తూ ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సీపీఎం మండల కార్యదర్శిగా బీటీ దొర



సీపీఎం మండల మహాసభలో 14 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బీటీ దొర, సభ్యులుగా ఎర్రునాయుడు, ఈశ్వరరావు, సిహెచ్.లక్ష్మి, చినదేముడు, కాశీ ఈశ్వరరావు, శంకర్, పోతురాజు, దొంగబాబు,సన్యాసినాయుడు, షేక్ అప్పాసాహెబ్, ఇరట ఈశ్వరరావు, దుప్పు దాసు ఎన్నికయ్యారు. నూతన సభ్యులను లోకనాథం, వెంకన్న అభినందించారు.

మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు

ఎంవీపీకాలనీ: ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం(పీఎంఏజేఏవై)లో భాగంగా ఎస్సీ మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్యపద్మ తెలిపారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా, ఇతర మహిళలకు సేవా, సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాలకు రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం అందిస్తామన్నారు. రూ.3లక్షల రుణం తీసుకుంటే ఇందులో రూ.50 వేల రాయితీ ఉంటుందని.. మిగతా రూ.2.5 లక్షల రుణాన్ని వడ్డీ లేకుండా చెల్లించాల్సి ఉంటుందన్నారు. విశాఖ జిల్లాలో 36 మందికి, అనకాపల్లి జిల్లాలో 31 మందికి, అల్లూరి సీతారామారాజు జిల్లాలో నలుగురికి రుణాలు అందిస్తామని ఈడీ తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 18 నుంచి 60 ఏళ్ల మహిళలు ఈ రుణాలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు సోమవారం నుంచి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు కి'లేడీ'ల అరెస్ట్

- ప్రయాణికుల నుంచి నగదు, బంగారం అపహరణ
- పట్టుకున్న పెందుర్తి క్రైం పోలీసులు, సొత్తు స్వాధీనం

పెందుర్తి: ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళల నుంచి నగదు, బంగారం, సెల్‌ఫోన్లు తస్కరించిన ఇద్దరు మహిళలను పెందుర్తి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వేపగుంట విద్యానగర్‌కు చెందిన నీలి జ్యోతి ఈ నెల 6న ఎన్ఏడీ కొత్త రోడ్ నుంచి వేపగుంటకు ఆటోలో వస్తుంది. ఈ క్రమంలో తన హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.23 వేలు విలువైన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ ఘటనపై పెందుర్తి పోలీసులను బాధితురాలు జ్యోతి ఆశ్రయించింది. మల్కాపురం జనతా కాలనీకి చెందిన కోసూరి లక్ష్మి గాజువాక నుంచి పీఎం పాలెం ఆర్టీసీ బస్‌లో ప్రయాణం చేస్తున్న క్రమంలో ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను దుండగులు తస్కరించారు. అందులో 12 తులాల బంగారు ఆభరణాలు, ఒక జత వెండి పట్టీలు, రూ.5 వేలు నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆయా కేసులను క్రైం విభాగం జోన్–2 ఏసీపీ డి.లక్ష్మణరావు, వెస్ట్ జోన్ సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆయా దోపిడీలకు పాల్పడిన విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన రావుల పార్వతి, మేకల గంగమ్మ అలియాస్ గంగలను పెందుర్తిలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 తులాల బంగారం, ఒక సెల్ ఫోన్, రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

చెరువు మదుం కూలి రైతు మృతి



రైతు కన్నంనాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య పార్వతి



చెరువు వద్ద కూలిన మదుం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

- పొలానికి నీరందించడానికి మదుం గేట్లు ఎత్తుతుండగా ఘటన

కె.కోటపాడు : పైడమ్మ చెరువు మదుం కూలిపోవడంతో సింగన్నదొరపాలేనికి చెందిన రైతు రొంగలి కన్నంనాయుడు(61) ఘటనా స్థలంలోనే శుక్రవారం మృతిచెందాడు. ఘటనపై మృతుని కుమారుడు మల్లునాయుడు ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. తన పొలానికి నీరును అందించేందుకు రైతు కన్నంనాయుడు పైడమ్మచెరువు వద్ద గల మదుం గేట్లు ఎత్తుతుండగా మదుం గోడ ఒక్కసారిగా కూలింది. దీంతో కన్నంనాయుడు కింద పడగా, మదుం గోడలు ఆయనపై పడిపోయాయి. దీంతో సంఘటన స్థలంలోనే మదుం గోడల మధ్య చిక్కుకుని కన్నంనాయుడు మృతిచెందాడు. కన్నంనాయుడు మృతదేహం వద్ద భార్య పార్వతి రోధన స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కన్నంనాయుడు మృతదేహానికి అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య



రెడ్డి బాబ్జీ (ఫైల్)

కశింకోట: దీర్ఘకాలిక అనారోగ్యాన్ని భరించలేక మనస్థాపం చెంది గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెరకాం గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు శనివారం అందించిన వివరాలివి. చెరకాం గ్రామానికి చెందిన రెడ్డి బాబ్జీ (29) గత 15 ఏళ్ల నుంచి ఆస్తమా, బ్లడ్ ఇన్‌ఫెక్షన్, ఊపిరితిత్తుల రుగ్మతలతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఎంతకూ అనారోగ్యం నుంచి బయటపడకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన ఇంటి వద్ద గడ్డి నివారణకు వేసే మందు తాగి పడిపోయి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు తండ్రి కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. అవివాహితుడైన బాబ్జీ లంకెలపాలెం వద్ద ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడన్నారు.

ఏలేరు కాలువలో పడి పాడి రైతు మృతి



మృతుడు దాసరి ఆనంద్ (ఫైల్)

కశింకోట : పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ ఏలేరు కాలువలో పడి పాడి రైతు మృతి చెందాడు. మండలంలోని జి. భీమవరం శివారు సింగవరంలో శనివారం ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం...సింగవరం గ్రామంలో దాసరి ఆనంద్ (53) గేదెలను మేపడానికి వెళ్లి వాటికి తాగునీటి కోసం ఏలేరు కాలువకు తీసుకెళ్లాడు. కాలువలో దిగుతుండగా ప్రమాదవశాత్తూ నీటిలో పడి మునిగి ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు వెలికి తీసి అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆనంద్ మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ మేరకు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్ మృతి

నక్కపల్లి : జాతీయరహదారిపై వేంపాడు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్ జెండర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నాతవరం మండలం మాధవరం గ్రామానికి చెందిన అంకం రెడ్డి రాజబాబు అలియాస్ రాధిక(35) కొద్ది సంవత్సరాల క్రితం ట్రాన్స్ జెండర్‌గా మారి తునిలో నివాసం ఉంటూ వేంపాడు టోల్‌ప్లాజా ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో టోల్‌ప్లాజా వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

పశువైద్యశాలలో స్వల్ప అగ్ని ప్రమాదం

- కాలిపోయిన ఫర్నిచర్, ఇంజక్షన్లు



ప్రమాదంలో కాలిపోయిన ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి మణిలక్ష్మణ్

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం పశు వైద్యశాలలో శనివారం ప్రమాదవశాత్తూ స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫర్నిచర్, కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు నిల్వ చేసిన కంటైనర్ ధ్వంసం అయ్యాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అలాగే ఆస్పత్రి రికార్డులకు కూడా ఎటువంటి నష్టం జరగలేదని పశువైద్యాధికారి డాక్టర్ మణిలక్ష్మణ్ తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ



అయ్యప్ప స్వామి అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

తుమ్మపాల: గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవస్థానానికి చెందిన మల్ల జగన్నాథం కల్యాణ మండపంలో అయ్యప్పస్వామి సన్నిధిలో శనివారం అయ్యప్ప అంబలం పూజ ఘనంగా జరిగింది. శ్రీ గౌరీ రైతు సంఘ ఆశ్రమ గురుస్వామి మల్ల నరసింగరావు, కాండ్రేగుల సీతారాం బాబ్జి ఆధ్వర్యంలో స్వాములు అంగుళూరి రాఘవ, కడిమిశెట్టి గణేష్ అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. ఊంజల సేవ, అంబలం పూజ, అభిషేకాల అనంతరం అన్నసమారాధన జరిపారు. గౌరీ సంఘం అయ్యప్ప స్వామి దేవాలయ గురు గురుస్వామి మద్దాల నారాయణ రావు, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, పీలా నాని, కాండ్రేగుల శ్రీను గురుస్వాములు స్వాములందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధ శ్రీనివాస రావు, యల్లపు చక్రవర్తి, మద్దాల భోగ లింగేశ్వరరావు, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాండ్రేగుల అప్పారావు

అనకాపల్లి: వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రైలు టిక్కెట్‌లో రాయితీ కల్పించాలని, జిల్లాలో వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బీశెట్టి కృష్ణ అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 1,664బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,810
మొదటి రకం	3,880	4,450
రెండో రకం	3,560	4,000
మూడోరకం	3,200	3,550

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	:పర్తిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
ధూం ధాం	:వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 3 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

అపార్ నమోదుకు అష్టకష్టాలు

- డిజిటల్ కార్డుల జారీలో సవాలక్ష అడ్డంకులు
- తప్పుల తడకగా ఆధార్‌లో వివరాలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- అనకాపల్లి పట్టణం,మండలంలో 50శాతం మాత్రమే నమోదు
- పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు వినతి



మండలంలో మామిడిపాలెం హైస్కూల్‌లో కంప్యూటర్‌లో విద్యార్థి అపార్ నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు



అనకాపల్లి: ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్రం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్)నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల వివరాలు అడ్మిషన్ రిజిస్ట్రార్‌తో పాటు యుడేస్‌లో పొందుపరచాలి. సంబంధిత కోడ్ నమోదు చేయగానే విద్యార్థి వివరాలు వస్తాయి. అపార్ నమోదు సమయంలో ఆధార్‌ను వినియోగించడం, అందులో వివరాలు తప్పుగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు, అడ్మిషన్ రిజిస్టర్, యుడైస్‌లతో వేర్వేరుగా ఉండడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లలో తప్పులను సరి చేసుకునేందుకు ఆధార్ సెంటర్, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నమోదు ప్రక్రియ అనకాపల్లి పట్టణ, మండలంలో ముందుకు సాగడంలేదు. ఇప్పటికి కేవలం 50 శాతం మాత్రమే పూర్తయింది. ఈ ప్రక్రియ శతశాతం పూర్తయ్యేందుకు మరో నెలరోజులకు పైగానే పడుతుందని భావిస్తున్నారు. విద్యాశాఖకు గతంలో ఇచ్చిన జనన ధ్రువీకరణ పత్రాలు చెల్లుబాటు కావని ఆధార్‌కేంద్రాల నిర్వాహకులు పేర్కొనడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2014 ముందు ఆన్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు మాన్యువల్‌గా జన్మదిన తేదీల సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఆధార్‌కార్డులో జన్మదిన తేదీ, పేరు, అడ్రస్ మార్పులు చేర్పులు చేసుకోవాలంటే పదో తరగతిలోపు విద్యను అభ్యసిస్తున్నవారైతే వారి పుట్టిన తేదీ, మీ సేవ, గ్రామ సచివాలయాల్లో జారీ చేసిన సర్టిఫికెట్లు తప్పనిసరిగా అందజేయాలి. అయితే ఆన్‌లైన్ వ్యవస్థ రాకముందు అధికారులు ఇచ్చిన జన్మదిన సర్టిఫికెట్లు చెల్లవంటూ ఆధార్ కేంద్రాల నిర్వాహకులు వెనక్కి పంపుతున్నారు. దీంతో జన్మదిన సర్టిఫికెట్ల కోసం మళ్లీసచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. అక్కడ ఉద్యోగులు పరిశీలించి తమ వద్ద రికార్డులేవంటూ నో అవైలబుల్ (ఫారం 10) సర్టిఫికెట్ ఇచ్చిన తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు పంపిచేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి తహసీల్దార్ కార్యాలయాలకు ప్రొసీడింగ్స్ ఇస్తున్నారు. ప్రొసీడింగ్స్ అనుసరించి తహసీల్దార్ జన్మదిన పత్రాలు అందజేస్తున్నారు. పై ప్రక్రియపూర్తి అయినప్పటికీ సుమారుగా 20 నుంచి 25 రోజుల సమయం పడుతోంది. ఇంత చేస్తేకానీ డిజిటల్ జన్మదిన సర్టిఫికెట్ చేతికి రావడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు సరిగ్గా నమోదు చేయకపోవడం వల్ల సమస్య మరింత ఇబ్బందిగా ఉంటోంది. ఆన్‌లైన్ సమస్యలు కూడా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వెంటాడుతున్నాయి. అనకాపల్లి పట్టణ, మండలంలో గల 8,543 మంది విద్యార్థులకు గాను 4,608 మంది విద్యార్థులు అపార్‌లో నమోదు చేసుకున్నారు. అపార్ మార్పుదానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఆ ప్రక్రియ సజావుగా జరగదని, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అపార్ కార్డు ఎంతో కీలకం

చాలామంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డులో ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయి. కేంద్రం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందులో నమోదై ఉంటాయి. ఒకసారి అపార్‌కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయి, ఉద్యోగం సాధించే వరకు ఇదే నంబర్ కార్డు ఉంటుంది. శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా ఉపాధి అవకాశాలకు సంబంధించి ఈ కార్డు కీలకం కానుంది.

ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



అపార్ నమోదులో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అపార్ పూర్తి అయ్యే వరకూ ఆ కేంద్రాలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుంది.

-కల్యాణ్, విద్యార్థి తండ్రి, అనకాపల్లి.

అప్‌లోడ్‌లో సమస్యలొస్తున్నాయి



విద్యార్థుల వివరాలు అపార్ యాప్‌లో నమోదు చేసినప్పుడు సమస్యలు వస్తున్నాయి. వివరాల్లో తప్పులు ఉండడంతో నమోదు ప్రక్రియలో జాప్యం ఏర్పడుతోంది. దీంతో బోధించేందుకు సమయం లేకుండా పోతోంది. ఈ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి.

– గొంది చిన్నబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి

శ్రుతిమించిన విద్యార్థుల ఆగడాలు

హైస్కూల్‌లో ఫ్యాన్లు, కుళాయిలు ధ్వంసం



పాఠశాల తరగతి గది డోర్‌కు అడ్డంగా ఆకతాయి విద్యార్థులు అమర్చిన సిమెంట్ ఇటుకలు



పాఠశాలలో ధ్వంసం చేసిన మంచినీటి కుళాయిలు

తుమ్మపాల: మండలంలో తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయి విద్యార్థుల ఆగడాలు శ్రుతి మించిపోతున్నాయి. పాఠశాలలో పరికరాలను ధ్వంసం చేస్తూ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారుతున్నారు. శుక్రవారం రాత్రి కొందరు విద్యార్థులు పాఠశాలలోకి ప్రవేశించి తరగతుల్లో విద్యుత్ బల్బులు, ఫ్యాన్లతో పాటు పాఠశాలలో గల మంచి నీటి కుళాయిలను ధ్వంసం చేశారు. దీంతో ఆగకుండా తరగతి గదుల డోర్లకు అడ్డంగా సిమెంట్ ఇటుకలను పేర్చారు. శనివారం ఉదయం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఆరా తీయగా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఇదంతా చేసినట్టు రుజువైంది. తల్లిదండ్రుల సమక్షంలో వారిని హెచ్చరించి, విడిచిపెట్టారు. మళ్లీ ఇటువంటి సంఘటనలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, పాఠశాల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించినట్టు పాఠశాల కమిటీ చైర్మన్ బలరాం తెలిపారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాలలో షేక్‌హుసెన్‌బీ అనే వ్యక్తి పాన్‌షాప్‌లో 11 మద్యం క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ శనివారం చెప్పారు. అందిన సమాచారం మేరకు పాన్‌షాప్‌ల్లో తనిఖీ చేసినట్టు సీఐ తెలిపారు.

వీధి దీపాలు వెలగక అవస్థలు

కశింకోట: మండల కేంద్రం కశింకోటలోని పలు చోట్ల వీధి దీపాలు వెగడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతన్నారు. అఫీషియల్ కాలనీ, గవరపేట, కస్పావీధి, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నారాయణ మృతికి సంతాపం

తుమ్మపాల: మున్సిపల్ మాజీ కౌన్సిలర్, సీపీఎం నాయకురాలు శరగడం శారద భర్త ఎస్.ఎస్.ఎస్. నారాయణ మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్‌లు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ నెల 8న దేవరాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణ మరణించడం విచారకరమన్నారు. ప్రజా సమస్యలపై జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. నాటి నుంచి నేటి వరకు సీపీఎం సానుభూతిపరులుగా నారాయణ ఉన్నారన్నారు.

తాగునీటికి ఇబ్బందులు

కశింకోట: కుళాయిల నుంచి నీటి సరఫరా జరగక మండలంలోని తాళ్లపాలెం కూడలి వద్ద యలమంచిలి వైపు మార్గంలో రోడ్డు పక్క ఉన్న ఇళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పక్షం రోజులుగా నీరు సరఫరా కావడం లేదని వారు తెలిపారు. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో జాతీయ రహదారిని దాటి వెళ్లి గ్రామంలో కుళాయిల నుంచి నీరు తెచ్చుకోవలసి వస్తుందని వారు వాపోయారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పాల జ్వరంతో అప్రమత్తం

నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకే ముప్పు



పాడి గేదెలు

కోటవురట్ల: రైతుకు పాడి, పంటా రెండూ రెండు కళ్లలాంటివి. రెండింటిలో దేనిని నిర్లక్ష్యం చేసినా నష్టం తప్పదు. పాడి పశువుల సంరక్షణలో తగు జాగ్రత్తలు పాటిస్తే నష్టం నుంచి తప్పించుకోవచ్చు. సకాలంలో వ్యాధులను గుర్తించడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు. ప్రధానంగా పాడి పశువుల్లో శీతాకాలం వచ్చే పాల జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే నష్టం తప్పదు. పాల జ్వరం లక్షణాలు, నివారణ, చికిత్స గురించి పశు సంవర్ధక శాఖ ఏడీ పెట్ల నరేష్ వివరించారు. మండలంలో 17 వేల పశువులున్నాయని, పాల జ్వరం గుర్తించిన వెంటనే తగిన చికిత్స చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఈనిన మొదటి వారంలోనే పాడి గేదెలు, ఆవుల్లో ఈవ్యాధి కనిపిస్తుంది. అధిక పాల ఉత్పత్తి ఉన్న పశువుల్లో పాల జ్వరం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా చాలా మంది రైతులు ఈనిన వెంటనే పాలను పితికేస్తారు. అలా చేయడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి కాల్షియం లోపం కారణంగా వచ్చే అవకాశం ఉంది. జున్ను పాలు, సాధారణ పాలను అధికంగా పితకడం వల్ల పశువు శరీరంలోని కాల్షియం శాతం తగ్గిపోవడంతో ఈ జ్వరం వస్తుంది.

నివారణ ఇలా.. ఈనిన వెంటనే పశువుల పొదుగును శుభ్రం చేయాలి. పొదుగు నుంచి మొత్తం పాలను పితకకూడదు. పశువు చూడితో ఉండగానే లేదా ఈనిన తర్వాత డాక్టరు సలహా మేరకు కాల్షియం, మెగ్నీషియం ఖనిజలవణాలు తగుమోతాదులో ఇవ్వాలి.

చికిత్స...వ్యాధి లక్షణాలుకనిపించిన వెంటనే డాక్టరును కలిసి కాల్షియం ఇంజక్షన్లు వేయించాలి. ముందుగానే తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారిన పడకుండా పశువును కాపాడుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు..

పశువులు తలను డొక్కలో పెట్టుకుని పడుకుంటాయి. బాగా నీరసించిపోయి మేత మేయడం మానేస్తాయి. ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువగా కింద పడిపోవడం, తన్నుకోవడం చేస్తాయి. కండరాలు వణకడం కనిపిస్తుంది. కళ్ల నుంచి నీరు కారుతూ, చెవులు వాచిపోతాయి. కొన్ని పశువుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే చూపు మందగిస్తుంది. పశువు చిరాకుగా ఉండి ఉలిక్కిపడుతూ ఉంటుంది. ఈ వ్యాధి పట్ల అశ్రద్ధ చేస్తే పశువులు మరణించే ప్రమాదం ఉంది.

వందరోజులు పూర్తయిన వారికి పనులు కల్పించాలి

నక్కపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వందరోజులు పూర్తయినవారికి కూడా పనులు కల్పించాలని స్థానిక ఎంపీటీసీ కుంచా మధు కోరారు. వేంపాడులో చాలామంది కూలీలకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి పనులు కల్పించాలని శనివారం వీరంతా అధికారులను కోరారు. అయితే మీకు వందరోజుల పూర్తయ్యాయి పనులు కల్పించడానికి కుదరదని అధికారులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ కుంచా మధు పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి వారికి పనులు కల్పించాలని అధికారులను కోరారు.

ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

యలమంచిలి రూరల్: ర్యాష్ డ్రైవింగ్‌తో పేట్రేగిపోతున్న యువకులకు పోలీసులు గట్టి షాకిచ్చారు. శనివారం పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీఐ ధనుంజయరావు నేతృత్వంలో పట్టణ పోలీసులు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు.ప్రధాన రహదారి,రైల్వేస్టేషన్ రోడ్డు,ఆర్టీసీ బస్ కాంప్లెక్స్,ఇతర అంతర్గత రద్దీ రహదారుల్లో నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్రవాహనాలతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారికి రూ.3,500 జరిమానా విధించారు. పట్టణంలో కొందరు యువకులు స్పోర్ట్స్ బైక్‌లతో మితిమీరిన వేగంగా దూసుకుపోతున్నారు. పాదచారులు,రోడ్లపైవెళ్లే సైకిలిస్టులు,ఇతర వాహన చోద కులు హడలిపోతున్నారు.తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులకు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ ధనుంజయరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేకపోతే కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ,పోలీసుసిబ్బందిపాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: న్యాయ విజ్ఞానం, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య అన్నారు. లీగల్ లిటరసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్నాలజీకి సంబంధించిన చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై పలు సూచనలు చేశారు. వాటికి గురైతే ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే మోసాల నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి. ఎన్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ

అనకాపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఈనెల 11న ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను స్థానిక వేల్పులవీధి పార్కు వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దీనంగా ఉందన్నారు. అందరికీ ఉచితంగా ఇసుక అందజేస్తామని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. ఈ నెలలో జరగనున్న రాష్ట్ర శాసన సభ సమావేశాలలో సంక్షేమ బోర్డు పునరుద్ధరించి ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా కార్మిక పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వమే స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి ఇసుక సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు మద్దాల రాము, ఎలమంచిలి బుజ్జి, యల్లపు శ్రీనివాస రావు, శ్రీను, రామకృష్ణ, బుద్దిరెడ్డి రమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై నేటి నుంచి నిరసనలు



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేద ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో సీపీఎం కన్వీనర్‌గా గంటా శ్రీరామ్, కమిటీ సభ్యులుగా కళ్ల తేలయ్యబాబు, బొప్ప ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాస రావు, కనకాల అప్పలరాజు, జి.సుభాషిణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధరల పెంపునకు నిరసనగా ఆదివారం నుంచి 18వ తేదీవరకు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేయనున్నట్టు చెప్పారు. రానున్న మూడు సంవత్సరాల్లో పట్టణ, మండల ప్రజల సమస్యలపై విస్తృతంగా పోరాటాలు చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారుగా ఐదు మాసాలు అవుతున్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



కశింకోటలోని గవరపేటలో వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

కశింకోట: మండల కేంద్రం కశింకోటలోని రెండు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాసం శనివారాన్ని పురస్కరించుకుని స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామిని వజ్ర కవచాలంకృతులను చేయడంతోపాటు వివిధ రకాల పూల దండలు, తులసీ మాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన , సాయంత్రం ఆకాశ దీపారాధన చేసి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని తులసీమాలలతో అలంకరించి పూలతో పూజలు నిర్వహించారు. అక్కడి శారదానదిలో కార్తీక స్నానాలు ఆచరించిన భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బీశెట్టి దుర్గానాగేశ్వరరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

11న వి.మాడుగులలో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న వి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సుగల, పదోతరగతి నుంచి పీజీ వరకూ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే వారు ముందుగా nai punyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7981102224 అనే నంబరులో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ కోరారు. రహదారి విస్తరణ బాధితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం విస్తరణ బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి విస్తరణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి విస్తరణ అవసరమని తెలిపారు.అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు రహదారిని వంద అడుగుల మేర విస్తరించేందుకు ఇప్పటికే అందరి అమోదం తీసుకున్నట్టు చెప్పారు. బాధితులకు మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. ఇందుకు బాధితులు కూడా సహకరించాలని కోరారు. రెండేళ్ల క్రితం నిర్ణయించిన ధర కాకుండా పెరిగిన భూముల ధరలను దృష్టిలో పెట్టుకుని పరిహారం పెంచేలా చూడాలని కొందరు కోరారు. సమస్యను కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళతామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీటీ శేషుబాబు,పెద్దలు పొలిమేర గణేష్, ఎ.వి.సత్యనారాయణ,సూరిశెట్టి కన్నారావు, కె.పి రావు,ఆడారి శ్రీరాములు,పెంటకోట జగన్నాథరావు, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.